సాక్షి
సూర్యాపేట
బుధవారం, 15, మే, 2024



తిరుగు పయనం
ఎన్నికలకు ఏపీకి వెళ్లినవారు తిరుగు పయనమయ్యారు. 65వ నంబర్ హైవేపై వాహనాలు బారులుదీరాయి. - 8లో



ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌గా..
ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌గా నేరేడుచర్ల పట్టణానికి చెందిన వనపర్తి నేహ ఎంపికైంది. - 8లో

గరిష్టం / కనిష్టం
38^0 / 26^0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

భానుపురి (సూర్యాపేట) : 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశం పొందేందుకు మార్చి2024లో పదో తరగతి ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఈనెల 15 నుంచి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె.లత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7.0 ఆ పైన జీపీఏ సాధించినవారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ సీజ్



ల్యాబ్‌ను సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

సూర్యాపేట : జిల్లాకేంద్రంలోని సుప్రజ ఆస్పత్రిలో మంగళవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఆపరేషన్లు చేసినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత మార్చి నుంచి ఇప్పటివరకు అర్హత లేకుండా 46 సర్జరీలు చేశారని తెలిపారు. దీంతో 15 రోజులు ఆస్పత్రి ఓపీ సేవలు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ల్యాబ్, ఆపరేషన్ థియేటర్ సీజ్ చేసినట్లు తెలిపారు. ఆపరేషన్లకు సంబంధించి సరైన వివరణ ఇవ్వకపోతే ఆస్పత్రిని కూడా సీజ్ చేస్తామని చెప్పారు. ఆయన వెంట వైద్యాధికారి వెంకటరమణ ఉన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేట : బహుజనులంతా ఏకమై మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించి మారోజు వీరన్న ఆశయాలను కొనసాగించాలని బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె. పర్వతాలు పిలుపునిచ్చారు. మారోజు వీరన్న వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. వర్ధంతి సందర్భంగా ఈనెల 16 నుంచి 30 వరకు గ్రామ గ్రామాన నిర్వహించే సభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బహుజన కార్మిక సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదల శ్రీనివాస్, బాణాల విజయ్ కుమార్, నాయకులు మంద్ర మల్లయ్య, బత్తుల వెంకన్న, నారగోని వెంకట్ యాదవ్, విజయ్, బుడిగం మల్లేష్ యాదవ్, బొల్లం లింగయ్య, అమ నాయక్, నరసయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, ఉద్యోగులపై లాఠీచార్జి అమానుషం

సూర్యాపేటటౌన్ :ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల ప్రకారం రావాల్సిన రెమ్యునరేషన్‌ను అడిగిన ఉపాధ్యాయులు, ఉద్యోగులపై లాఠీచార్జి చేయడం అమానుషమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జ్యోతుల చంద్రశేఖర్, చింతరెడ్డి రామలింగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లాఠీచార్జి చేసిన అధికారులు, పోలీసులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రజాసమస్యలపై దృష్టి పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

సూర్యాపేట : పాలకులు అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలని మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని విక్రమ్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నెలల నుంచి ఎన్నికల హడావుడిలో ఉండి అధికారులు, పాలకులు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేశారని, దీంతో ప్రజలు అనేక ఇబ్బందుల ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో నీటి ఇబ్బందులు, కరెంటు సమస్యలు ఎదురయ్యాయన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎర్ర అఖిల్, లింగన్న, శేషగిరి, భిక్షం ,మీరా పాల్గొన్నారు.

ఆదరించేదెవరినో..

- ముగిసిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ
- పోస్టల్ ఓట్లు కలుపుకొని 75.04 శాతం ఓటింగ్ నమోదు
- ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం
- అంచనాల్లో అభ్యర్థులు, పార్టీలు
- జూన్ 4న తేలనున్న ఫలితం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పోలింగ్ ప్రక్రియ సోమవారం పూర్తయింది. పోలింగ్ బూత్‌లలో వేసిన ఓట్లు 74.02 శాతం, పోస్టల్ ఓట్లు 1.02 శాతం కలుపుకొని మొత్తంగా 75.04 శాతం పోలింగ్ నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొని ఓటు వేశారు. పట్టణ ప్రాంతాల్లో కాస్త తగ్గినప్పటికీ సాయంత్రం వేళ ఓటింగ్ పెరిగింది. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు ఇతర పార్టీలు, స్వతంత్రులు మొత్తంగా 22 మంది బరిలో ఉన్నారు. ఇందులో మూడు ప్రధాన పార్టీల మధ్యే పోటీ నెలకొంది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఈవీఎంలను నల్లగొండ సమీపంలో అనిశెట్టిదుప్పలపల్లి పరిధిలోని వేర్ హౌజింగ్ కార్పొరేషన్ గోదాముల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు. జూన్ 4న కౌంటింగ్ జరగనుంది. ఆ రోజునే వారి భవితవ్యం తేలనుంది.

పోలైన పోస్టల్ ఓట్ల వివరాలు

నియోజకవర్గం	పోలైన ఓట్లు	శాతం
దేవరకొండ	1137	0.43
నాగార్జునసాగర్	1349	0.58
మిర్యాలగూడ	2410	1.02
హుజూర్‌నగర్	1696	0.67
కోదాడ	2269	0.93
సూర్యాపేట	2979	1.22
నల్లగొండ	4135	1.66
ఇతర ప్రాంతాలనుంచి	1676	0.09
మొత్తం	17651	1.02



దేవరకొండలో తక్కువ.. హుజూర్‌నగర్‌లో ఎక్కువ

నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా.. ఈ ఎన్నికల్లో హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎక్కువ శాతం పోలింగ్ నమోదు కాగా, దేవరకొండలో తక్కువగా నమోదైంది. హుజూర్‌నగర్‌లో అత్యధికంగా 76.34 శాతం మంది ఓట్లు వేయగా, దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో 70.60 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎవరి అంచనాలు వారివే..

నల్లగొండ లోక్‌సభ స్థానాన్ని తాము గెలుస్తామంటే.. తమకే అనుకూలంగా ఓట్లు వేశారంటూ ప్రధాన పార్టీల అభ్యర్థులు, పార్టీలు లెక్కలు వేసుకుంటున్నాయి. ఏ నియోజకవర్గంలో ఏయే మండలాలు, గ్రామాలు, పోలింగ్ బూత్‌లలో తమకు ఓట్లు పడ్డాయన్న వివరాలపై ఆరా తీస్తున్నాయి. తమకు అనుకూలమైన ఓటు పడిందని, తమ గెలుపు ఎప్పుడో ఖాయమైందని, దేశంలోనే అధిక మెజార్టీ వస్తుందంటూ కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నారు. బీజేపీ మాత్రం మోదీ చరిష్మాపైనే నమ్మకంతో ఉంది. బీఆర్‌ఎస్ మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామిలను అమలు చేయకపోవడంతో ఆ పార్టీపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లన్నీ బీఆర్‌ఎస్ పార్టీకే పడ్డాయని చెప్పుకుంటోంది.

మూడంచెల భద్రత

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను అనిశెట్టిదుప్పలపల్లి వద్ద స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. అక్కడ మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ విధించడంతో పాటు స్థానిక పోలీసులతోపాటు ఆర్మ్‌డ్ రిజర్వుడ్, కేంద్ర బలగాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పహారా కాస్తున్నాయి. 24 గంటలు సాయుధ బలగాలు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

2019 కంటే స్వల్పంగా పెరుగుదల

నల్లగొండ పార్లమెంట్ నియోజకర్గం పరిధిలో 2019 లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే ఈసారి పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. 2019 ఎన్నికల్లో పోస్టల్, ఎస్‌ఆర్‌ఐ ఓట్లు కలుపుకొని మొత్తంగా 74.13 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈ సారి 75.04 శాతానికి పెరిగింది. ఇక 2014 ఎన్నికలో 79.75 శాతం పోలింగ్ నమోదైంది. దాంతో పోల్చితే మాత్రం ఈ ఎన్నికల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

2023 అసెంబ్లీ ఎన్నికల కంటే తక్కువ..

2023 అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం 84.51 శాతం ఓట్లు నమోదు కాగా.. లోక్‌సభ ఎన్నికల్లో 74.13 శాతం ఓట్లు నమోదయ్యాయి. అప్పటి కంటే 10.38 శాతం ఓటింగ్ తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ హుజూర్‌నగర్ నియోజకవర్గంలోనే అధికంగా పోలింగ్ శాతం నమోదైంది. నల్లగొండలో అతి తక్కువ పోలింగ్ నమోదైంది.

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 2023 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల పోలింగ్ శాతం ఇలా..

అసెంబ్లీ సెగ్మెంట్	అసెంబ్లీ (2023)	లోక్‌సభ (2024)
దేవరకొండ	84.49	70.60
నాగార్జునసాగర్	85.79	74.50
మిర్యాలగూడ	83.49	73.34
హుజూర్‌నగర్	86.44	76.34
కోదాడ	85.56	75.21
సూర్యాపేట	84.21	73.07
నల్లగొండ	81.60	75.20

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం పోలైన ఓట్ల వివరాలు..


నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్	మొత్తం
దేవరకొండ	94,896	90,405	9	1,85,310
నాగార్జునసాగర్	87,949	88,231	10	1,76,190
మిర్యాలగూడ	85,811	87,513	10	1,73,334
హుజూర్‌నగర్	94,065	97,871	9	1,91,945
కోదాడ	90,604	93,801	10	1,84,415
సూర్యాపేట	88,069	90,301	8	1,78,378
నల్లగొండ	92,203	95,328	34	1,87,565
మొత్తం	6,33,597	6,43,450	90	12,77,137

పోలింగ్ ప్రశాంతంగా సాగింది

- రిటర్నింగ్ అధికారి హరిచందన



నల్లగొండ : నల్లగొండ లోక్‌సభ స్థానానికి నిర్వహించిన పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన తెలిపారు. ఇందుకు సహకరించిన రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, ప్రజలు, ఓటర్లు, అధికారులు, మీడియా ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరిని కలెక్టర్ అభినందించారు.



మట్టపల్లిలో పునర్నిర్మించిన రాజగోపురం, ప్రాకారం

మట్టపల్లి క్షేత్రానికి కొత్త శోభ

- రాజగోపురం, ప్రాకారం పునర్నిర్మాణ పనులు పూర్తి
- 21 నుంచి బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ రాజగోపురం, ప్రాకారం పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈనెల 22న స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నందున ఆలయ కమిటీ సభ్యులు రాజగోపురం, ప్రాకారం పునర్నిర్మాణ పనులను పూర్తి చేయించారు. ఆలయ నిధులు సుమారు రూ.30 లక్షలకు పైగా వెచ్చించి 130 అడుగుల పొడవు, 12 అడుగుల ఎత్తులో ప్రాకారం నిర్మించారు. గతంలో ఉన్న రాజగోపురానికి మరిన్ని మెరుగులు దిద్ది అందంగా తయారు చేశారు. శిల్ప కళ (నగిషీ) పనులు కూడా పూర్తిచేశారు. రాజగోపుర ప్రాకారంపై నవనారసింహక్షేత్రాల రూపాలను ప్రతిష్ఠించారు. సప్తవర్ణ శోభితంతో శ్రీస్వామివారు ఆశీనులైనట్లుగా అందంగా శిల్పాలను తయారుచేశారు. కాగా, ఈనెల 21నుంచి ఐదు రోజుల పాటు జరిగే శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో 22న శ్రీస్వామివారి తిరుకల్యాణం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నాం




రెండు తెలుగు రాష్ట్రాల భక్తుల పూజలు అందుకుంటున్న మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఎట్టకేలకు రాజగోపురం ప్రాకారం పునర్నిర్మాణం పూర్తిచేశాం. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం.

–చెన్నూరు మట్టపల్లిరావు, ఆలయ అనువంశిక చైర్మన్

ఎన్నికల నిర్వహణ సంతృప్తికరం

- కలెక్టర్ వెంకటరావు



భానుపురి (సూర్యాపేట) : లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ ఎస్. వెంకటరావు మంగళవారం ఒక ప్రకటనలో సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి పోలింగ్ ముగిసే వరకు జిల్లా ప్రజల సహాయ సహకారాలు, భాగస్వామ్యం మరవలేనిదని పేర్కొన్నారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకోవడంలో చైతన్యం చాటారని, దీంతో గత పార్లమెంటు ఎన్నికల కంటే అధికంగా పోలింగ్ నమోదైందని తెలిపారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని హుజూర్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 1,91,945 ఓట్లు పోల్ కాగా 76.34 శాతం పోలింగ్ నమోదైంది, కోదాడలో 1,84,415ఓట్లు పోల్ కాగా 75.21 శాతం, సూర్యాపేటలో 1,78,378 ఓట్లు పోల్ కాగా 73.07 శాతం, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలోని తుంగతుర్తి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 1,92,005ఓట్లు పోల్ కాగా 74.06 శాతం పోలింగ్ నమోదైనట్లు వివరించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 3,70,026మంది పురుషులు, 3,76,686 మంది మహిళలు, 31 మంది ట్రాన్స్ జెండర్లు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,000,012 ఓట్లకు 7,46,743 పోలయ్యాయని, 74.67 శాతం పోలింగ్ నమోదైందని పేర్కొన్నారు.

జగదీశ్‌రెడ్డి అవినీతిని బయటపెడతాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, హాజరైన పోలింగ్ బూత్ ఏజెంట్లు, నేతలు

- మాజీ మంత్రి దామోదర్ రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : పదేళ్ల మంత్రిగా పనిచేసి అవినీతి అక్రమాలకు పాల్పడిన స్థానిక ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అవినీతిని బయటపెడతామని మాజీమంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని బాలాజీ గ్రాండ్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ ఏజెంట్లు, నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని జగదీశ్ రెడ్డి భూకబ్జాలకు పాల్పడ్డారని, త్వరలోనే విచారణ చేపట్టి ఈ భూములను పేదలకు పంచుతామన్నారు. విద్యుత్ శాఖ మంత్రిగా జగదీశ్ రెడ్డి సూర్యాపేట నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని, కాంగ్రెస్ హయాంలో తీసుకొచ్చిన సబ్ స్టేషన్లను తానే తీసుకొచ్చినట్లు గొప్పలు చెప్పుకున్నాడని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేశారని, రఘువీర్ రెడ్డి ఎంపీగా గెలిచేందుకు కష్టపడ్డారని అన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత గ్రామాల్లో వేసే ఇందిరమ్మ కమిటీల్లో కష్టపడిన వారికి స్థానం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఏఐసీసీ మెంబర్ రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, రాష్ట్ర నాయకులు కొప్పుల వేనా రెడ్డి, రాజేశ్వరరావు, జ్ఞాన సుందర్, రంగారెడ్డి, భాస్కర్, అంజద్ అలీ, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం ఆంజనేయ స్వామికి అర్చకులు ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. అంజనీపుత్రుడికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అర్చకులు అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడు సేవ పూజలు నిర్వహించారు.

ఆర్టీసీకి ‘ఎన్నికల’ ఆదాయం

- నాలుగు రోజుల్లో రూ.6.64 కోట్లు

నల్లగొండ రూరల్ : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నల్లగొండ రీజియన్‌లో ఆర్టీసీకి భారీగా ఆదాయం సమకూరింది. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, దేవరకొండ, నార్కట్‌పల్లి, మిర్యాలగూడ, యాదగిరిగుట్ట, కోదాడ, సూర్యాపేట డిపోల పరిధిలో శుక్రవారం నుంచి సోమవారం వరకు నాలుగు రోజుల పాటు మొత్తం 643 బస్సులను 9.28 లక్షల కిలోమీటర్ల దూరం తిప్పారు. దీంతో ఆర్టీసీకి మొత్తం రూ.6,64,63,000 ఆదాయం సమకూరింది. సాధారణ రోజుల్లో రూ.కోటి వరకు ఆదాయం వస్తుండగా.. ఎన్నికల సందర్భంగా ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగించడంతో ఈ నాలుగు రోజుల్లో ఆదాయం పెరిగిందని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

డిపోల వారీగా ఆదాయం ఇలా..

డిపో	ఆదాయం
దేవరకొండ	1,28,40,000
నల్లగొండ	1,15,91,000
నార్కట్‌పల్లి	1,04,67,000
మిర్యాలగూడ	1,05,29,000
యాదగిరిగుట్ట	97,00,000
కోదాడ	89,40,000
సూర్యాపేట	1,13,97,000



ప్రజల పక్షాన పోరాడుతున్నా

- పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

నకిరేకల్ : తాను ఎప్పటి నుంచో ప్రజల పక్షాన పోరాడుతున్నానని.. మాజీ సీఎం కేసీఆర్ వందల కేసులు పెట్టించినా భయపడలేదని పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. నకిరేకల్‌లో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ఏకం కావడంతో ఒక నియంతను గద్దె దిగి.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆనాడు తాను ప్రజల కోసం కేసీఆర్‌ను ప్రశ్నించడం వల్లే అక్రమ కేసులు పెట్టించాడని గుర్తు చేశారు. తాను కుటుంబ ఆస్తులను ప్రభుత్వానికి రాసిచ్చి ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దిగానని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభిమానం చూపించాలని పట్టభద్రులను కోరారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ తెలంగాణ ప్రజల కోసం తన ప్రాణాన్ని ఫణంగా పెట్టే తీన్మార్ మల్లన్నను ఈఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, టీపీసీసీ నేతలు చామల శ్రీనివాస్, దైద రవీందర్, బచ్చుపల్లి గంగధర్‌రావు, గాజుల సుకన్య, మాద యాదగిరి, నకిరేకంటి నరేందర్, నాగులంచ వెంకటేశ్వరరావు, బొజ్జ సుందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

‘కూల్ రూఫ్’ నామమాత్రమే!

- ఇళ్లలో వేడిని తగ్గించేందుకు కొత్త పథకం
- స్లాబ్‌లపై కూల్ పెయింట్ వేసుకునేలా ప్రభుత్వం చర్యలు
- 600 గజాలు పైబడిన భవనాలకు తప్పనిసరి
- మున్సిపాలిటీల్లో ఏడాది నుంచి అమలు
- అవగాహన లేక ఆసక్తిచూపని భవన యజమానులు

హుజూర్‌నగర్: వేసవిలో ఎండలు మండుతున్నాయి. జిల్లాలో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 24 డిగ్రీలు ఉండాల్సిన గది సాధారణ ఉష్ణోగ్రత 38 డిగ్రీలకు చేరుతోంది. ఈ నేపథ్యంలో ఇళ్లలో వేడి ప్రభావాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీల్లోని భవనాల స్లాబ్‌లపై కూల్ పెయింట్ వేసుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలంగాణ చలువ పైకప్పు (కూల్ రూఫ్) పేరిట గతేడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త పథకాన్ని అమల్లోకి తెచ్చింది. అయినప్పటికీ జిల్లాలో కూల్ రూఫ్ చేయించుకునేందుకు భవనాల యజమానులు ముందుకు రాకపోవడంతో ఈ విధానానికి స్పందన అంతంత మాత్రంగానే ఉంది.

నివాసయోగ్య భవనాలకు తప్పనిసరి..

ప్రతి మున్సిపాలిటీలో దాని స్థాయిని బట్టి 5 లక్షల చదరపు అడుగుల వరకు వైట్ పెయింట్ వేసేలా లక్ష్యం నిర్దేశించారు. 600 చదరపు గజాలు, అంతకన్నా ఎక్కువ విస్తీర్ణం కలిగిన నివాసయోగ్య భవనాలకు ఈ చలువ పైకప్పు విధానం తప్పనిసరి చేసింది. అపార్ట్‌మెంట్ నిర్మాణాలు, భారీ భవంతులు దీని పరిధిలోకి వస్తాయి. కోరిన వారందరికీ నిర్ణీత రుసుం స్వీకరించి ప్రక్రియను అమలు చేయాలి. సర్కారు భవనాలు, వాణిజ్య సముదాయాలకు తప్పనిసరి చలువ విధానం వర్తింపజేయాలి.

సూర్యకిరణాలు పరావర్తనం చెందేలా..

భారీ భవనాలను సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మించడంతో పైకప్పులు ఎండకు వేడెక్కుతాయి. చలువ పైకప్పు విధానంలో సూర్యకిరణాలు పరావర్తనం చెందేలా పైకప్పునకు ప్రత్యేక పూత పూస్తారు. ఇందులో మూడు పద్ధతులు ఉన్నాయి. మొదటి పద్ధతిలో లైమ్‌వాష్/పాలిమర్/ప్లాస్టిక్ సాంకేతికతను వినియోగిస్తారు. రెండో పద్ధతిలో పాలివినీల్ క్లోరైడ్ ఆధారంగా పైకప్పును తీర్చిదిద్దుతారు. మూడో పద్ధతిలో ఆల్బిడో సిరామిక్ మొజాయిక్ టైల్స్‌ను పైకప్పులో అమరుస్తారు. మూడింటిలో ఏ పద్ధతినైనా ఎంచుకోవచ్చు. పైకప్పులో వినియోగించే సామగ్రి వేడిని తగ్గిస్తాయి. సాధారణ ఇళ్లతో పోలిస్తే చలువ పైకప్పు ఉన్న నిర్మాణాలు 80 శాతం వేడి ప్రభావం లేకుండా చేస్తాయి. సర్కారు ఆమోదించిన ఏజెన్సీలు, ప్రైవేట్ సంస్థలు ఈ పనులను నిర్వహిస్తాయి. కూల్ రూఫ్ విధానంపై అవగాహన కల్పిస్తున్నా ఇళ్ల యజమానులు ముందుకు రావడంలేదు.



సూర్యాపేటలో ఓ ఇంటి స్లాబ్‌పై వేసిన కూల్ పెయింట్

అవగాహన కల్పిస్తున్నాం



వేసవి వేడి, ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం పొందేలా కూల్ రూఫ్ పథకం అమలు చేయాలని ప్రభుత్వం నుంచి గతేడాది ఏప్రిల్‌లోనే ఆదేశాలు వచ్చాయి. ఈ ఆదేశాలు అమలు చేస్తున్నాం. కొత్తగా భవనం నిర్మించుకునే వారికి కూల్ రూఫ్ నిర్మించుకుంటేనే అనుమతి పత్రాలు జారీ చేస్తున్నాం. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ పథకాన్ని భవన యజమానులు సద్వినియోగం చేసుకోవాలి.

– కె.శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్, హుజూర్‌నగర్

క్లుప్తంగా

ఆయిల్‌పామ్ తోట దగ్ధం



దగ్ధమైన ఆయిల్‌పామ్ డ్రిప్ సిస్టమ్

ఆలేరురూరల్ : ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంగళవారం 12ఎకరాల ఆయిల్‌పామ్ తోట దగ్ధమైంది. స్థానికులు, ఉద్యానవన శాఖ అధికారి సైదులు, తోట యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొలనుపాక గ్రామానికి చెందిన గోపి శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో 12ఎకరాల్లో సంవత్సరం నర్రక్రితం దాదాపు 450 ఆయిల్‌పామ్ మొక్కలు నాటాడు. పక్కన గల పొలంలో ఎండిన గడ్డికి నిప్పుపెట్టడంతో తోటకు మంటలు అంటుకొని పామాయిల్ తోట, డ్రిప్పు పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు. నష్టాన్ని అంచనా వేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి నష్టపరిహారం వచ్చేలా చూస్తామన్నారు.

ఆగిఉన్న లారీల నుంచి డీజిల్ చోరీ



డీజిల్ చోరీ అయిన లారీ

తుర్కపల్లి : ఆగిఉన్న ఓ లారీలోంచి గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం డీజిల్ చోరీకి పాల్పడ్డారు. వివరాల ప్రకారం.. మండలంలోని వాసాలమర్రి గ్రామశివారులో ఉన్న సాయిబాలాజీ రైస్‌మిల్‌లో తవుడు లోడ్ చేసుకునేందుకు లారీతో వచ్చిన డ్రైవర్ మంగళవారం ఉదయం లోడ్ చేసుకుందామని అక్కడే ఉంచాడు. ఈ తరుణంలో రాత్రి 1గంట సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి ఆగిఉన్న లారీలో ఉన్న 350లీటర్ల డీజిల్‌ను దొంగిలించారు. ఈ క్రమంలో లారీ డ్రైవర్ ఉదయం ఇంజిన్ ఆన్‌చేయగా కాకపోవడంతో అనుమానంతో డీజిల్ చెక్ చేశాడు. ట్యాంక్‌లో డీజిల్ లేకపోవడంతో రైస్‌మిల్ యజమాన్యానికి తెలిపాడు. వారు రైస్‌మిల్ సీసీ కెమెరాలో పరిశీలించగా డీజిల్ దొంగతనం బయటపడింది. డ్రైవర్ శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తక్యూద్దీన్ తెలిపారు.

శ్రీకృష్ణుడి విగ్రహం ధ్వంసం

భువనగిరి క్రైం : మండలంలోని బస్వాపురం గ్రామం గల శ్రీకృష్ణుడి ఆలయంలోని విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు మంగళవారం ధ్వంసం చేశారు. మద్యం మత్తులో గ్రామస్తుడు చిక్క శేఖర్ అనే వ్యక్తి విగ్రహాన్ని ధ్వంసం చేశాడని గ్రామస్తులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో ఇలాంటి ఘటనే చోటు చేసుకుందని, అతడిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ద్విచక్రవాహనం అపహరణ

భువనగిరి క్రైం : పట్టణంలోని బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనాన్ని అపహరించారు. వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కొడారి వెంకటేశ్ మంగళవారం బస్టాండ్‌కు వచ్చి హైదరాబాద్ స్టాప్ వద్ద తన ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేసి బస్టాండ్‌లోకి వెళ్లాడు. తిరిగి వచ్చేలోపు బయట ఉన్న ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని దుండగులు అపహరించారు. ఈ మేరకు బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు

- ముక్కలైన ట్రాక్టర్.. డ్రైవర్ మృతి
- అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిలో ఘటన
- మృతుడు పెద్దవూర మండలం లింగంపల్లి గ్రామ వాసి



ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో ముక్కలైన ట్రాక్టర్

నల్లగొండ క్రైం : మట్టిలోడ్‌తో వెళ్తున్న ఓ ట్రాక్టర్‌ను అతివేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు వెనుక నుంచి ఢీకొటింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ముక్కలుగా విడిపోగా డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన నల్లగొండ పట్టణ సమీపంలోని అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిలో ఆర్జాలబావి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. నల్లగొండ రూరల్ ఎస్‌ఐ శివశంకర్ తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్న మార్నింగ్ స్టార్ ట్రావెల్ బస్సును డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి పానగల్ వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఫరంగి మహేష్(24) తన సీట్లో నుంచి ఎగిరి రోడ్డుపై పడ్డాడు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ తునాతునకలై కొన్ని ఇనుపరాడ్లు మహేష్ కడుపులో గుచ్చుకోవడంతో పేగులు బయటపడి తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు అతడిని వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స అందేలోగా మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ మహేష్ స్వగ్రామం పెద్దవూర మండలం లింగంపల్లి, అతడు జీవనోపాధి కోసం నల్లగొండలోని పాతబస్తీ హనుమాన్‌నగర్‌లో భార్యతో ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి ఏడాది లోపు పాప ఉంది. మృతుడి భార్య వర్ష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ తెలిపారు.

పెరుగు ప్యాకెట్‌కు వెళ్లి..

- బస్సు ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయిన ఒడిషా యువకుడు
- తూప్రాన్‌పేట శివారులో ఘటన



ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

చౌటుప్పల్ : తెచ్చుకున్న సరుకులోని పెరుగు ప్యాకెట్ రోడ్డుపై పడిపోవడంతో దానిని తీసుకొచ్చేందుకు వెళ్లిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని తప్రాన్‌పేట శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామశివారులో ఆగస్త్య ఆగ్రో లిమిటెడ్ కంపెనీలో ఒడిషా రాష్ట్రంలోని రాయఘడ్ జిల్లాకు చెందిన నికోలస్ సభర్(28)తో పాటు రుమీల్ సభర్, రాహుల్ సభర్, సిభాలు కొంతకాలంగా పనిచేస్తున్నారు. అందరూ కలిసి స్థానికంగానే నివాసం ఉంటున్నారు. సొంతంగా వంట చేసుకునే ఈ నలుగురు మంగళవారం ఉదయం 8గంటల ప్రాంతంలో సమీపంలోని కొత్తగూడకు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకున్నారు. కంపెనీ ఎదురుగా జాతీయ రహదారిని దాటారు. అదే సమయంలో తమ వెంట తెచ్చుకున్న సరుకుల సంచిలో నుంచి ఓ పెరుగు ప్యాకెట్ రోడ్డుపై పడిపోవడాన్ని వారు గుర్తించారు. వెంటనే నికోలస్ సభర్ అనే యువకుడు పడిపోయిన పెరుగు ప్యాకెట్ కోసం మళ్లీ రోడ్డు దాటుకుంటూ వెళ్లాడు. పెరుగు ప్యాకెట్ తీసుకొని అక్కడే రోడ్డు దాటుతుండగా హైదరాబాద్‌కు రాంగ్‌రూట్‌లో వెళ్తున్న టీఎస్08 యూబీ 8184 గల ప్రైవేట్ ట్రావెల్ బస్సు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్నేహితులు చికిత్స నిమిత్తం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కళ్ల ఎదుటే స్నేహితుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందడంతో సహచరులు బోరున విలపించారు. అజాగ్రత్తగా, అతివేగంగా బస్సును నడిపిన బస్సు డ్రైవర్ మేలేని యాదగిరిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని లారీ డ్రైవర్ దుర్మరణం



ఘటనా స్థలంలో లారీడ్రైవర్ మృతదేహం

మాడుగులపల్లి : ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కుక్కడం గ్రామశివారులో అద్దంకి– నార్కట్‌పల్లి రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాకు చెందిన లారీడ్రైవర్ గంధం ప్రసన్నతేజ చెన్నై నుంచి మెంతుల లోడు లారీతో మహారాష్ట్రకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కుక్కడం శివారుకు రాగానే లారీని రోడ్డు పక్కకు నిలుపుతుండగా పక్క నుంచి వేగంగా వచ్చిన ఏపీకి చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రసన్నతేజ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు చిలకలూరిపేట ఆర్టీసీ డిపోకు చెందినదిగా తెలిసింది. అతివేగం, నిర్లక్ష్యంగా బస్సు నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.

పిడుగుపాటుతో యువకుడు మృతి

- మరో ఇద్దరికి గాయాలు



మృతిచెందిన మర్రి రిషి

త్రిపురారం : పిడుగుపాటుతో ఓ యువకుడు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన త్రిపురారం మండలంలోని నీలాయిగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలంలోని వెలుగుపల్లికి చెందిన మర్రి రిషి (20) బీటెక్ చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో త్రిపురారం మండలంలోని నీలాయిగూడెంలో ఉంటున్న రిషి మేనమామ గుండెబోయిన నాగయ్య ఇంటికి వెళ్లాడు. సాయంత్రం గ్రామంలోని కొంత మంది యువకులతో కలిసి సమీపంలో ఉన్న పొలాల్లో క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. కొద్దిసేపటికి గాలి దుమారం, మెరుపులతో కూడిన వర్షం వస్తుండడంతో పక్కనే ఉన్న తాటిచెట్టు కిందికి వెళ్లారు. అదే సమయంలో పిడుగు పడింది. దీంతో మర్రి రిషి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సరదాగా వేసవి సెలవులు గడుపుదామని వచ్చిన యువకుడు పిడుగుపాటుతో మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మిర్యాలగూడలో బీఆర్‌ఎస్ నాయకులపై దాడి

మిర్యాలగూడ అర్బన్ : కాంగ్రెస్ నాయకులు తమపై దాడి చేశారని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం జరిగిన ఎన్నికల నేపథ్యంలో మిర్యాలగూడ పట్టణంలోని బాబూజీనగర్‌లో బీఆర్‌ఎస్ నాయకులపై స్థానిక కాంగ్రెస్ నాయకులు మధ్యాహ్నం తీవ్ర పదజాలంతో దూషించారు. దీంతో అక్కడి నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు వెళ్లిపోయారు. కాగా రాత్రి సమయంలో కాంగ్రెస్ నాయకులు పాతూరి ప్రసాద్, పాతూరి మురళి, అఖిల్, వెంకటేశ్వర్‌రావు, శరత్, శ్రీనివాస్, లక్కీ, తన్నీరు సాయి, రవి కర్రలు, రాడ్లు, పదునైన ఆయుధాలతో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, దుర్గాచారి, శ్యామ్, క్రాంతి, జనార్దన్ ఇళ్లపై దాడికి దిగారు. ఈ దాడిలో దుర్గాచారి బొటనవేలుకు తీవ్రగాయం కాగా జానార్దన్, శ్యామ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో వారిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం వారు ఆస్పత్రి నుంచి ఇంటికి రాగా మరలా అర్ధరాత్రి కాంగ్రెస్ నాయకులు దాడి చేసి ఇక్కడే ఉంటే చంపుతామని బెదిరించినట్లు మంగళవారం బాధితులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమపై అకారణంగా దాడి చేసి, తమ ఇళ్లను కూల్చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి మహిళ మృతి

భువనగిరి క్రైం : రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపల్లి–బొమ్మాయిపల్లి రైల్వేస్టేషన్ల మధ్యన 13/18–19 మైలురాయి వద్ద సుమారు 40 సంవత్సరాల గల గుర్తు తెలియని మహిళ రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతిరాలి ఒంటిపై ఎరుపు, నలుపు రంగు చీర, ఎరుపు, నలుపు రంగు గీతల జాకెట్ ధరించి ఉంది. మహిళ మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు. మహిళ ఆచూకీ కోసం 8712568454ను సంప్రదించాలని కోరారు.

ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌గా నేరేడుచర్ల వాసి

- నేహాను అభినందించిన తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు



తల్లిదండ్రులు శ్రీనివాస్–సుజాతలతో నేహ

నేరేడుచర్ల : ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకటించిన ఫలితాల్లో నేరేడుచర్ల పట్టణానికి చెందిన వనపర్తి నేహ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌గా మంగళవారం ఉద్యోగం సాధించింది. నేరేడుచర్లకు చెందిన వనపర్తి శ్రీనివాస్–సుజాత దంపతుల కుమార్తె నేహ. ఆమె పాఠశాల విద్యాభ్యాసం ప్రగతి ఇంగ్లిష్ మీడియంలో, 10వ తరగతి 2015–2016లో చిల్లెపల్లిలోని సిటీ సెంట్రల్ పాఠశాలలో చదివి 9.8 జీపీఏ సాధించింది. మాదాపూర్‌లోని నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ అభ్యసించి 467/470 మార్కులతో మొదటి సంవత్సరం స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించగా ద్వితీయ సంవత్సరంలో 990/1000 మార్కులతో స్టేట్ 3వ ర్యాంకును సాధించింది. 2017లో వరంగల్ ఎన్‌ఐటీలో సీటు సాధించి 2018–22వరకు మెకానికల్ ఇంజనీరింగ్‌ను పూర్తి చేసింది. అనంతరం బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ పరీక్ష రాసి ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. వారి స్వగ్రామం గరిడేపల్లి మండలంలోని పోనుగోడు కాగా నేరేడుచర్లలో స్థిరపడ్డారు. తల్లి సుజాత గృహిణి కాగా తండ్రి శ్రీనివాస్ ఫెర్టిలైజర్స్ పరిశ్రమలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు, సోదరుడు ప్రోత్సాహంతో విజయం సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. నేహాను తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు అభినందించారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో 'నవోదయ' జయకేతనం

- పది, పన్నెండు తరగతుల్లో వందశాతం ఉత్తీర్ణత



చలకుర్తిలోని జవహర్ నవోదయ విద్యాలయం



కుర్ర కృష్ణప్రసాద్ (485/500)



పంతంగి అఖిలేష్ (479/500)



బుర్ర శిశిర (477/500)



ఆలేటి స్టాలిన్ (455/500)



ఆర్.మహేందర్ (448/500)



ఎల్క కౌశిక్ (425/500)

పెద్దవూర : మండలంలోని చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు సీబీఎస్‌ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) ప్రకటించిన పది, పన్నెండు తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చినట్లు ప్రిన్సిపల్ ఆర్.నాగభూషణం మంగళవారం తెలిపారు. పదోతరగతిలో 80మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 80 మంది ఉత్తీర్ణత సాధించి వందశాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. వారిలో 68 మంది విద్యార్థులు డిస్టింక్షన్‌లో, 8మంది ప్రథమ శ్రేణిలో, 4గురు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. పదోతరగతిలో కుర్ర కృష్ణప్రసాద్ 500మార్కులకు గాను 485మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, పంతంగి అఖిలేష్ 479 మార్కులతో ద్వితీయ స్థానంలో, బుర్ర శిశిర 477మార్కులు సాధించి తృతీయ స్థానంలోనూ నిలిచినట్లు తెలిపారు. కుర్ర కృష్ణప్రసాద్, బెండల రాంచరణ్‌తేజ్ తెలుగులో వంద మార్కులు సాధించినట్లు తెలిపారు.

పన్నెండో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత..

పన్నెండో తరగతిలో 28మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 28 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వారిలో 19మంది విద్యార్థులు డిస్టింక్షన్ లోనూ, 9 మంది ప్రథమ శ్రేణిలోనూ ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. పన్నెండో తరగతిలో ఆలేటి స్టాలిన్ 500మార్కులకు గాను 455మార్కులతో ప్రథమ స్థానం, రమావత్ మహేందర్ 448మార్కులతో ద్వితీయ, ఎల్క కౌశిక్ 425మార్కులతో తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

వ్యవసాయ మోటార్ల చోరీ

మఠంపల్లి : వరిపొలాల సాగుకు పలువురు రైతులు చెరువులో ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ విద్యుత్ మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మంగళవారం బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యాతవాకిళ్ల గ్రామం సమీపంలోని చీపురేణికుంటపై వరిసాగు కోసం ఏర్పాటు చేసుకున్న తొమ్మిది వ్యవసాయ విద్యుత్ మోటార్లను రెండురోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధిత రైతులు పాల్వాయి సైదయ్య, బానోతు పంతులనాయక్, ఎల్లావుల శివశంకర్, మల్లెబోయిన వీరబాబు, పులి కోటయ్య, సాముల నాగిరెడ్డి, మాళోతు సోమ్లానాయక్ వాపోయారు. సోమవారం రాత్రి మోటార్లను చోరీ చేశారని తెలిపారు.

ఏపీ నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనం

- హైదరాబాద్–విజయవాడ రహదారిపై వాహనాల రద్దీ



చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై బారులదీరిన వాహనాలు

చౌటుప్పల్ : పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఓటు వేసేందుకుగాను హైదరాబాద్, పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ఏపీకి వెళ్లిన ప్రజానీకం మంగళవారం అదే స్థాయిలో తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో రహదారులన్నీ వాహనాలతో భారులుదీరాయి. ఎన్నికల రోజు మధ్యాహ్నం వరకు కూడా ఆంధ్రా వైపుకు వాహనాలు వెళ్లాయి. స్వగ్రామాల్లో ఓటు వేసిన అనంతరం ప్రజలంతా భారీగా తిరుగు ప్రయాణాలు ప్రారంభించారు. దీంతో సోమవారం సాయంత్రం నుంచి హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి రద్దీగా మారింది. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా పరిసరాలు వాహనాలతో నిండిపోయింది.



చౌటుప్పల్ పట్టణంలో రాత్రి వేళ వాహనాల రద్దీ

మామిడికోతలో జాగ్రత్తలు తప్పనిసరి..!

- కాయలపై సొన కారకుండా చూడాలి
- ఉదయం 10గంటలలోపే కోతకోయాలి
- సరైన జాగ్రత్తలు పాటించకపోతే నష్టపోవాల్సి వస్తుంది
- ఉద్యానవన శాఖ అధికారి బి.రవినాయక్



బి.రవినాయక్, ఉద్యానవన శాఖ అధికారి, పెద్దవూర

పెద్దవూర : ఈ ఏడాది వాతావరణ మార్పులతో మామిడిలో దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. మామిడి కాయలు ఇప్పుడిప్పుడే పక్వానికి వస్తుండడంతో కోతలు కూడా మొదలుపెట్టారు. అయితే చేతికందిన కాయలు, పండ్లను సరైన పద్ధతుల్లో నిల్వ, రవాణా చేస్తేనే కొంత లాభాలు వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో మామిడి కోతతో పాటు నిల్వ, రవాణా చేసే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మామిడి కాయలు కోత సమయంలో నిర్లక్ష్యం చేసినా అపార నష్టం వాటిల్లే అవకాశం ఉందని, ఈ సమయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోతే రైతులు నష్టపోవాల్సి వస్తుందని పెద్దవూర మండల ఉద్యానవన శాఖ అధికారి బి.రవినాయక్ సూచిస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే నష్టాలను తగ్గించుకోవచ్చు..

కాయలను సరైన పద్ధతిలో కోయకపోవడం, ముదిరిన కాయలతో పాటుగా, ముదరని కాయలను కోయడం, గ్రేడింగ్, ప్యాకింగ్‌లో సరైన ప్రమాణాలు పాటించకపోవడం, అపరిశుభ్రత, నిల్వ లోపాల వలన పండ్లు చెడిపోతాయి. సరైన యాజమాన్య పద్ధతులను అనుసరించడంతో ఈ నష్టాలను తగ్గించుకోవచ్చు. నిల్వ, రవాణా సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే అధిక లాభాలు పొందవచ్చనని మండల ఉద్యానవన శాఖ అధికారి తెలిపారు.



మామిడితోట

ఎంపికే కీలకం.. ఉదయం 10గంటలలోపే కోయాలి

తోటల్లో కాయలను సరైన దశలోనే కోయాలి. కాయలకు భుజాలు ఏర్పడి, తొడిమ వద్ద గుంత ఉండడంతో పాటు శ్వేతగ్రంథులు కనిపిస్తుండాలి. కాయ ఆకుపచ్చ రంగు నుంచి బాగా ముదిరిన లేత ఆకుపచ్చ రంగు కలిగిన కాయలనే కోతకు ఎంపిక చేసుకోవాలి. వాటిలోనూ బ్రిక్స్ (చక్కెర శాతం) ఉన్న కాయలనే కోయాలి. బ్రిక్స్ మీటర్ ద్వారా బ్రిక్స్ 10–13 ఉన్న కాయలను కోసుకోవాలి. రిఫ్రాక్టో మీటరును ఉపయోగించి కాయల పరిపక్వ దశను సులభంగా గుర్తించవచ్చు. ఇవి రవాణాకు అనుకూలంగా ఉంటాయి. కోత ఉదయం 10 గంటల లోపు లేదంటే సాయంత్రం వేళల్లోనే ఉండాలి. పక్వానికి వచ్చిన కాయలను చిక్కాలను ఉపయోగించి నేలపై పడకుండా కోసుకోవాలి. కాయలకు గాయాలైతే మగ్గబెట్టిన సందర్భంలో శిలీంధ్రాలు ఆశించి కుళ్లిపోయే ప్రమాదం ఉంది. కాయలకు 6నుంచి 7సెంటీమీటర్ల తొడిమ ఉండేటట్లు చూసుకోవాలి. కాయల మీద ఉండే చర్మానికి సొన(జిగురు) అంటకుండా జాగ్రత్త తీసుకోవాలి. కాయ కోసిన తర్వాత తప్పనిసరిగా సొన(జిగురు) పూర్తిగా కారేలా చూడాలి. తర్వాత తొడిమలను 0.5 నుంచి 1 సెంటీమీటర్ వరకు ఉండేలా పదునైన కత్తితో కత్తిరించాలి. వాటిని తలకిందులుగా పెట్టి రెండుమూడు గంటలపాటు కదిలించకుండా ఉంచాలి. అప్పుడే కాయల నుంచి సొన సజావుగా నేల మీదికి కారుతుంది. కోతల సమయంలో కాయలపై చిన్న మచ్చగానీ, దెబ్బగానీ తగలకుండా జాగ్రత్త పడాలి. కోసిన కాయలను మట్టినేలపై ఉంచకూడదు.

పాడి పంట

శుభ్ర పర్చడం చాలా అవసరం..

మామిడి కాయలను శుభ్రపరచడం చాలా అవసరం. 10గ్రాముల డిటర్జెంట్‌ను 10లీటర్ల నీటికి కలిపిన ద్రావణంలో కడగాలి. తర్వాత 52సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత గల వేడి నీటిలో 200 పీపీఎం సోడియం హైపోక్లోరైడ్ కలిపి 2 నుంచి 3నిమిషాల పాటు ఉంచాలి. రవాణా సమయంలో ఆంత్రాక్నోస్, పండు ఈగల ఉధ్రుతి ఎక్కువగా ఉంటుంది. వాటి నివారణకు కాయలను 48+0.3 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత కలిగిన నీటిలో గంట సేపు శుద్ధిచేయాలి. కాయలపై ఉన్న తేమ ఆరే వరకు నీడలో ఆరబెట్టాలి. 300–350 గ్రాముల బరువు ఉండేటట్లు గ్రేడింగ్ చేసుకుని, అట్టపెట్టెలలో 10 నుంచి 13 కాయలు అమర్చి ప్యాకింగ్ చేసుకోవాలి. ప్యాంకిగ్ కోసం టెలిస్కోపిక్ కార్గేటెడ్ ఫైబర్ బోర్డు బాక్సులను వాడాలి. వీటిని ఆరుగంటలలోపే ప్యాక్‌హౌజ్‌కు తరలించాలి. విదేశాలకు ఎగుమతి చేయాల్సిన పండ్లకు తప్పనిసరిగా ఇర్రాడియేషన్ చేయించాలి.

పురుగు మందులను పిచికారీ చేయరాదు

నిషేధించిన పురుగు మందులను కాయలపై పిచికారీ చేయకూడదు. వీలైనంత వరకు సేంద్రియ పురుగు మందులను మాత్రమే వాడాలి. కోత తరువాత వచ్చే తెగుళ్ల నివారణకు తోటలో ముందు నుంచే మంచి జాగ్రత్తలు తీసుకోవాలి. తోటలో కలుపు లేకుండా శుభ్రం చేసుకోవాలి. కాయలు చిన్నసైజులో ఉన్నప్పుడు, తిరిగి కాయ కోతకు ముందు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ లేదా థయోఫానేట్ మిథైల్ కలిపి చెట్లపై పిచికారీ చేయాలి. కాత దశలో మూడుసార్లు ఇలా పిచికారీ చేస్తే కాయలపై చీడల బెడద తగ్గుతుంది. కాయలు కుళ్లిపోకుండా ఉంటాయి.

ఒకసారి కోతకు ఉపయోగించిన పనిముట్లను మళ్లీ వాడాల్సి వస్తే వాటిని తప్పనిసరిగా శుభ్రం చేయాలి.

ఇథిలిన్‌తో మాగించాలి..

మామిడి కాయలను వ్యాపారులు కార్బైడ్ అనే రసాయనాన్ని ఉపయోగించి కృత్రిమంగా మాగిస్తున్నారు. దీని వలన కాయ మంచి రంగు వస్తుంది కాని రుచి ఉండదు. పైగా అనారోగ్యానికి కారణమవుతోంది. రైతులు, వ్యాపారులు కార్బైడ్‌తో మాగించడానికి స్వస్తి పలికి ఆరోగ్యవంతమైన పద్ధతుల ద్వారా మాగించాలి. అప్పుడే రుచి, శుచి లభిస్తాయి. ఈ రెండు ఉంటే మంచి ధర లభిస్తుంది. ఇథిలిన్‌తో మామిడని మాగించడం అన్ని విధాలా మంచిది. ఇథిలిన్ అనేది గ్రోత్ హార్మోన్. ఇది అన్నిచోట్ల లభ్యమవుతుంది. 10 లీటర్ల నీటికి ఒక మిల్లీలీటర్ ఇథిలిన్ కలిపిన ద్రావణంలో మామిడి కాయలను ముంచి నీడలో ఆరబెట్టిన తర్వాత గదిలో మామిడిని పోసి వరిగడ్డి కప్పితే 14గంటల్లోనే మంచి రంగు, సువాసన వస్తుంది. ఇలా మామిడిని మాగించడం అన్ని విధాలా ఆరోగ్యదాయకం.